# వడ్డెళ్ళ వీరయ్య చౌదరి



**కీ. శే. వడ్డెళ్ళ వీరయ్య చౌదరి గారు**



**M.K. సుహాసిని (అరుణ)**

శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హై స్కూలు పూర్వ విద్యార్థిని ఐన నేను M.K. సుహాసిని (అరుణ), పాఠశాల వజ్రోత్సవం సందర్భంగా నా శుభాభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంలో మా నాన్నగారు, ఈ పాఠశాల వ్యవస్థాపన లో కీలక పాత్ర పోషించిన కీ. శే. V V చౌదరి గారి గురంచి కొన్ని వాక్యాలు ప్రస్తావించదలిచాను.

V V చౌదరి గారు 1925 వ సంవత్సరంలో కీ. శే. వడ్డెళ్ళ వెంకట సుబ్బయ్య, తాయమ్మ గార్లకు జన్మించారు. ఏకైక పుత్రుడు. ఆయనకు చిన్ననాటి నుండి విద్య పట్ల చాల ఇష్టం ఉండేది. ఆ ఆసక్తితోనే గుంటూరు లో **P U C** వరకు చదివారు.

కాలక్రమంలో అదే ఆసక్తి వలన మన ఊరిలో అందరూ చదువుకోవాలనే సుసంకల్పంతో, పాఠశాల ప్రారంభించాలనే ప్రస్తావన కీ. శే. శిరిగిరి పేరయ్య గారు తీసుకువచ్చినపుడు తాను భాగస్వామినై మొదటి ట్రెజరర్ గా ఎన్నుకోబడి పాఠశాల నిర్మాణ పర్యవేక్షణ భాద్యతలను అంతా తానే దగ్గర వుండి చూసే వారు. కీ శే పేరయ్య గారు కూడా కమిటీలో చదువుకొన్న వారు నాన్నగారే అవడం వలన అన్ని పనులను తనకే చెప్పి చెయ్యమనే వారట. అన్ని విషయాలు మిగతా కమిటీ సభ్యులతో చర్చించి సమన్వయము చేసుకొని నిర్వహించే వారినని చెప్పేవారు.

1961 వ సంవత్సరంలో శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హై స్కూలు శంకుస్థాపన జరిగినది. పాఠశాల ప్రారంభం అయిన వెంటనే ఉపాధ్యాయులును నియమించలేకపోవడంతో తాను, శిరిగిరి సుబ్బారావు మరియు శిరిగిరి వెంకటేశ్వర్లు తో కలసి 6 వ తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పామని అన్నారు. ఉపాధ్యాయుల నియామకం దగ్గరనించి వారికి అవసరమైన అన్ని వసతులను కమిటీ తరపున ఏర్పాటు చేసేవారట. ప్రధానోపాధ్యాయునితో సంప్రతింపులు జరుపుతూ పాఠశాల అభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తుండడం, మేమూ అదే పాఠశాలలో చదువుకునేటప్పుడు గమనిస్తుండేదాన్ని. పాఠశాల ప్రారంభం అయిన నాటి నుండి సుమారు నాలుగు దశాబ్దాలు కరెస్పాండెంటుగా తన సేవలను అందించారు. నాన్న గారు చనిపోయే వరకు కమిటీలో సభ్యునిగా కొనసాగారు ఈ విధంగా పాఠశాల అభివృద్ధిలో నాన్న గారు కీలక పాత్ర పోషించారు.

ఆయన పదవీకాలంలో వ్యవసాయం చేస్తూ కుడా పాఠశాల అభివృద్ధికి నిరంతరం పాటు పడేవారు. అయన ఎల్లప్పుడూ అందరూ చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించేవారు. తన మనస్సులో చదువుకు ఉన్న ప్రాధాన్యత వల్ల తన పుత్రుడైన V ఉమామహేష్ ను Ph,D., పుత్రికనైన నన్ను బాచిలర్ డిగ్రీకి వేరే రాష్ట్రానికి, దూరప్రాంతాలకి పంపి అభ్యసింపచేసారు. ఈ విధంగా అందరికి అవకాశం కల్పిస్తూ, అందరి అభ్యున్నతిని ఆకాంక్షించే V V చౌదరి గారు మన మధ్య లేనప్పటికీ, ఎల్లప్పుడూ చిరస్మరణీయులే.

ఇట్లు
M.K. సుహాసిని (అరుణ)
చేకూరపాడు